ప్రజాశక్తి

బుధవారం 6 డిసెంబర్ 2023 5

శ్రీ సత్యసాయి





డీవోకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి -పెనుకొండ

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. కరువు సహాయక చర్యలు చేపట్టాలని, వ్యవసాయ మోటర్లకు విద్యుత్ మీటర్లు బిగించరాదని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి జిల్లా వ్యాప్తంగా వరుస కరువు, అతివష్టి, అనావష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అసారి రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. పంటలు చేతికందక రైతులు అప్పులఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన చేసి, చేతులు దులుపుకోకుండా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓ వైపు పంటలు లేక మరో వైపు గ్రామాల్లో వలసలు లేక రైతులు, కూలీలు సొంతూర్లను వదలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారన్నారు. వలసలను నివారించేందుకు వెంటనే గ్రామాల్లో ఉపాధి పనులను చేపట్టాలన్నారు. తీవ్ర దుర్భిక్షంలో ఉన్న రైతులను మరింత ఇబ్బంది పెట్టేలా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించే చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటోందన్నారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.40 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుల అన్ని రకాల అప్పులను మాఫీ చేయాలన్నారు. వలసలను అరికట్టేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ఏడాదికి 200 రోజులకు పెంచే, రోజు కూలి రూ.600 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీవోకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, సిపిఎం నాయకులు తిప్పన్న, రంగప్ప, కొండా వెంకటేశులు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారత ఇదేనా..?!

◆ శాసనసభ స్థానాల్లో 50 శాతం కేటాయించేరా..

◆ స్థానిక సంస్థలు, కార్పొరేషన్లకే పరిమితమా..

◆ వైసిపి సామాజిక సాధికార యాత్రల నేపథ్యంలో చర్చ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బీసీలంటే బ్యాక్‌వర్డు కాదు... బ్యాక్‌బోన్ అంటూ వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రను చేపట్టింది. ఈ సందర్భంగా నేతలు వైసిపి అధికారంలోకి వచ్చాక బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ప్రకటిస్తున్నారు. జనాభాలో 50 శాతమున్న బిసిలకు పదవుల్లోనూ 50 శాతం స్థానాలు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. ఈ పదవులన్నీ ఇప్పటి వరకు చూస్తే స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల కేటాయింపుల వరకే ఉన్నాయన్న విమర్శలున్నాయి. విధానపరమైన నిర్ణయాలు జరిగే శాసనసభకు పోటీ చేసే అసెంబ్లీ స్థానాలకు టిక్కెట్లు కేటాయించే విషయంలో లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

66 శాతం ఒసిలకే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో రెండు రిజర్వు స్థానాలుపోనూ 12 జనరల్ స్థానాలున్నాయి. ఇందులో చూసినప్పుడు 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎనిమిది అసెంబ్లీ సీట్లకు ఓసి అది కూడా రెడ్డి సామాజిక తరగతికి చెందిన వారికే టిక్కెట్టును వైసిపి కేటాయించింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, పెనుకొండ, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు స్థానాలు బీసీలకు, ఒక స్థానం మైనార్టీకి కేటాయించారు. తక్కిన ఎనిమిది నియోజకవర్గాల్లో ఓసిలకే టిక్కెట్లు ఇచ్చారు. అందులోనూ కళ్యాణదుర్గం మంత్రి ఉషచరణ్‌శ్రీ ఉన్నారు. ఆమె భర్త చరణ్‌రెడ్డి ఓసి సామాజిక వర్గానికి చెందన వారనే విమర్శ ఉంది. ఇక రిజర్వు నియోజకవర్గాల్లో ఇదే రకమైన విమర్శ కనిపిస్తోంది. శింగనమల ఎస్సీ రిజర్వు స్థానం నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డే రాజకీయ వ్యవహారాలు నియోజకవర్గంలో చూస్తారు. పేరుకు పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ వ్యవహారాలు అన్నీ చూస్తుండటంతో ఇందులో సామాజిక న్యాయం ఏ రకంగా అవుతుందన్న ప్రశ్నలు సర్వత్రా లేవనెత్తుతున్నారు. తాజాగా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగాఉన్న ఇక్బాల్‌ను తొలగించాక దీపికారెడ్డిని పెట్టారు. ఆమె బిసి అయినప్పటికీ భర్త వేణుగోపాల్‌రెడ్డి ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. రాజకీయాల్లో కీలకమైన అసెంబ్లీ స్థానాలకు టిక్కెట్లు కేటాయించే విషయంలో సామాజిక సాధికారత ఎక్కడుందన్న ప్రశ్నను సామాజికవేత్తలు లేవనెత్తుతున్నారు.

టిడిపిలోనూ 50 శాతానికిపైగా ఓసిలే

2019 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకీ ఓసిలకే అధిక ప్రాధాన్యతనిచ్చిందన్న విమర్శ ఉంది. వైసిపి రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పిస్తే టిడిపి కమ్మ సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. 14 అసెంబ్లీ స్థానాల్లో ఐదు స్థానాల్లో వారికే టిక్కెట్లు కేటాయించింది. అనంతపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, ధర్మవరం, హిందూపురం అసెంబ్లీ స్థానాల్లో కమ్మ సామాజికవర్గానికి చెందిన వారుండగా, పుట్టపర్తి, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందినవారున్నారు. 14 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది స్థానాల్లో ఓసిలకు చోటు కల్పించారు. కదిరి, గుంతకల్లు, రాయదుర్గం, పెనుకొండ మాత్రమే బిసిలకు కేటాయించారు. తక్కిన రెండు స్థానాలు రిజర్వు నియోజకవర్గాలున్నాయి. ఈ రకంగా చూస్తే రెండు ప్రధాన పార్టీలు కూడా బిసి, ఎస్సి,మైనార్టీలకు కేటాయిచిన సీట్ల ప్రాధాన్యత ఏ పాటితో అర్థమవుతుంది. మాటల్లో సామాజిక సాధారికాత, ప్రధానమైన పదవుల వరకు వచ్చే సరికి ఓసీల వైపే రెండు ప్రధాన పార్టీలు మొగ్గు చూపుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఓటు నమోదుపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

పక్కాగా ఓటర్ల నమోదు

◆ సమస్యలు లేకుండా చూడాలి ◆ కలెక్టర్ పి.అరుణ బాబు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఓటర్ల నమోదులో ఎలాంటి సమస్యలూ లేకుండా పక్కాగా జాబితాను తయారు చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కదిరి ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కదిరి డివిజన్ పరిధిలోని సహఎన్నికల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, బీఎల్వోలతో పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారంపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, కదిరి ఆర్డీవో వంశీకష్ణ డివిజన్ పరిధిలోని తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. బల్క్‌గా అందిన దరఖాస్తులపై ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాతనే పరిష్కారం చేయాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటూ జాబితా నుంచి తొలగించేందుకు వీల్లేదన్నారు. చేర్పులు, తొలగింపులు, మతులకు సంబంధించి బిఎల్‌వోలు రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తమ ఓటును మార్చుకోదల్చినప్పుడు కూడా పూర్తి వివరాలను తీసుకోవాలన్నారు. ఫారం-7 విషయంలో ఎటువంటి అనుమానాలు వచ్చినా తిరస్కరించ వచ్చన్నారు. ఫారం-6 విషయంలో తగిన ధ్రువీకరణలు సమర్పించాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు ఓటరు చేర్పులు, తొలగింపులు, మార్పులు చేయడానికి ఎన్నికల కమిషన్ సూచనలను తప్పక పాటించాలని తెలిపారు. డిసెంబర్ 9వ తేదీలోపు ఎన్నికల క్లైమ్స్‌ను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, తహశీల్దార్లు సునీత, అమిద్‌బాషా, నరేంద్ర కుమార్, రవికుమార్, శోభరాణి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి అదనపు బస్సులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ నుంచి నడిచే రైళ్లు రద్దు కారణంగా పుట్టపర్తి, ధర్మవరం నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజా రవాణా కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తచెరువు సమీపంలో టన్నెల్ పనులు జరుగుతున్నందున పుట్టపర్తి మీదుగా వెళ్లే అన్ని రైళ్ళను డిసెంబర్ 8 నుంచి ఫిబ్రవరి 7 వరకు పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల, ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ధర్మవరం రైల్వే స్టేషన్ నుంచి పుట్టపర్తికి రావడానికి అలాగే పుట్టపర్తి నుంచి ధర్మవరం వెళ్లడానికి మొత్తం 25 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయా డిపో మేనేజర్లు సమయపాలన పాటిస్తూ బస్సులను నడపాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, గ్యారేజీ, ట్రాఫిక్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.



లిఫోటో:- సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ప్రజా రవాణా అధికారిలి



డ్రమ్ములతో తాగునీటిని తీసుకెళ్తున్న జమ్మానిపల్లి గ్రామస్తుడు

జమ్మానిపల్లిలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి మడకశిర

మండల పరిధిలోని జమ్మానిపల్లిలో తాగునీటి సమస్య నెలకొంది. తాగునీటి కోసం మూడురోజులుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రెండు తాగునీటి బోరుబావులున్నాయి. వెంకటాపురం రోడ్డులో ఉన్న బోరు మూడు రోజుల క్రితం చెడిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మినీ ట్యాంకర్ ద్వారా ఓ రైతు సాగునీటి బోరు ద్వారా ఇంటి అవసరాలకు గ్రామస్తులు నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి బోరుబావిని మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - నంబుల పూల కుంట

మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. పెడబలి రోడ్డు వద్ద మురుగునీరు, చెత్తచెదారం నిల్వ ఉంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారివెంబడి వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలకేంద్రంలోనే పారిశుధ్య వ్యవస్థ ఇంత అధ్వానంగా ఉంటే ఇక మిగిలిన పంచాయతీల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పారిశుధ్య చర్యలు తీసుకోవటంలో సంబందిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి పారిశుధ్య వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మైనార్టీల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి బుక్కపట్నం

మైనార్టీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆపార్టీ జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో 85 లక్షల రూపాయలతో పల్లె రఘునాథ్ రెడ్డి సహకారంతో జామియా మసీద్ షాదీఖానాను పునర్ నిర్మించామని అన్నారు. అదేవిధంగా మైనార్టీల సంక్షేమం కోసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనార్టీలకు అండగా నిలబడ్డామని చెప్పారు.



సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న సామకోటి ఆదినారాయణ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నగర పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని నగర పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాడ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవకు మంగళవారం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న హెల్త్ అలవెన్స్, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను అప్కాస్‌లో చేర్చాలని బాబయ్య ఉరుసు సందర్భంగా అదనంగా కార్మికులను తీసుకోవాలన్నారు. పట్టణ జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు ఇచ్చిన హామీను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మనీ, గజేంద్ర, రిక్షా నరసింహులు, ముత్యాలు, లక్ష్మీదేవి, శాంతమ్మ, గంగరత్నమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థులు చదువుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి తమ లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్ బాషా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సత్య సాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకుస్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి తరం యువత చదువుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కళాశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర ప్రసాద్, ఓబులేసు, దస్తగిరి, ఓబయ్య, గంగరాజు, వినయ్ కుమార్, రామాంజనేయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్యహక్కు చట్టం రద్దుచేయాలి



మాట్లాడుతున్న బార్ అసోషియేషన్ అధ్యక్షులు సుబ్బారావు



హిందూపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

భూ యాజమాన్య హక్కుచట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండ్‌తో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ధర్మవరం బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ఆ అసోషియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేకమైన ఈ చట్టాన్ని రదుచేయాలన్నారు. స్థిరాస్థి విషయంలో తగాదాలు ఏర్పడితే పరిష్కరించే అధికారం సివిల్ కోర్టుల పరిధిలో నుంచి తప్పించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే జిల్లా స్థాయి ట్రిబ్యునల్ కు అప్పగిస్తారన్నారు. ఈ ట్రిబ్యునల్ నిర్ణయం పై అప్పిలు అధికారం హైకోర్టుకు మాత్రమే ఇచ్చారన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలతో సంబంధంలేకుండా సహజ న్యాయసూత్రాల ఆధారంగా తీర్పులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ తీర్పులు రెవిన్యూ అధికారుల విచక్షణపై ఆధారపడి ఉంటాయన్నారు. వీరిపై రాజకీయ ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉంటుందని దీంతో సామాన్యుడికి అన్యాయంజరిగే పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ నిపుణులతో సంప్రదించకుండా ప్రజాభిప్రాయం లేకుండా ఏకపక్షంగా రూపొందించిన ఈచట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

పెనుకొండ :భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ సమావేశ భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కుల యాజమాన్య చట్టంలో అమల్లోకి తీసుకొచ్చిందని అన్నారు. చట్టంలోని అంశాలు లక్ష్యానికి విరుద్ధంగా ఉండటమే కాక, వ్యక్తిగత ఆస్తులపై ప్రజా హక్కులను కాల రాసే విధంగా ఉన్నాయన్నారు. న్యాయస్థానం పరిధిలోని హక్కులను నిర్ధారించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాధికారులకు కట్టబెట్టడం రాజ్యాంగ చట్ట వ్యతిరేకమన్నారు. ఈ చర్య వలన ప్రజల వ్యక్తిగత ఆస్తి హక్కుల విషయంలో విపరీతమైన రాజకీయ జోక్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వము వెంటనే వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌తో బుధవారం నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు కోర్టు విధులకు బహిష్కరిస్తూ ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేయాలని అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆసిఫ్,శివశర్మ, నాగిరెడ్డి, శ్రీనివాసులు, జావిద్, మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగజేసే భూహక్కుల యాజమాన్య చట్టాలను వెంటనే రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, హిదయతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక కోర్టు నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ న్యాయ నిపుణులు, మేధావులతో ఏమాత్రం చర్చలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత చట్టాన్ని అమలులోకి తీసుకురావడం తగదన్నారు. ఈ చట్టం వల్ల ప్రజలు తమ ఆస్తి హక్కులను పరిరక్షించుకునేందుకు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు వ్యక్తిగత, రాజకీయ జోక్యం హెచ్చు మీరే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగ సహజ న్యాయ సూత్రానికి విరుద్ధంగా అమలు చేసిన ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని. లేని పక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుదర్శన్, గోపాలకృష్ణ, సిద్ధు, శివశంకర్, శ్రీరాములు, కృష్ణమూర్తి, రవికుమార్, వెంకటేష్, రకిబ్, ఈశ్వరప్ప, కళావతి, సంతోషి కుమారి, అంజనమ్మ, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

32 మండలాలనూ కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి



ధర్మవరంలో ఎడ్లబండ్ల ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు



, ర్యాలీలో పాల్గొన్న నాయకులు



చిలమత్తూరులో తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నల్లచెరువు

జిల్లాలోని 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడాసుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రవికుమార్‌కు మంగళవారం సమర్పించారు. ఈసందర్భంగా బడాసుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవక జిల్లా వ్యాప్తంగా 2 . 84 లక్షల హెక్టార్లు సాగుకు కాను కేవలం 98,500 హెక్టార్లలో మాత్రమే సాగు అయిందన్నారు. 65 శాతం భూములన్నీ బీడు భూములుగా మారిపోయాయన్నారు. రైతులు పంట సాగుకు తెచ్చిన అప్పులు తీర్చలేక వలసలు వెళ్లారన్నారు. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని మండలంలో కరువు సహాయకచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది పంట పెట్టి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి 40 వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. భూమిని చదును చేసి పంట పెట్టేందుకు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసి వర్షాలు పడక పంట వేయక నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల రూపాయలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సభ్యులు శ్రీరాములు, మండల పరిధిలోని రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఇసుక రవణా చేస్తూ జీవనం సాగించే ఎడ్లబండ్ల యజమానులకు అండగా మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఎడ్ల బండ్ల తో ధర్మవరం పట్టణంలో ర్యాలీ, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద నుంచి ప్రారంభమై ర్యాలీ కదిరి గేటు చౌడమ్మ గుడి గాంధీనగర్ ఎన్టీఆర్ సర్కిల్ కళా జ్యోతి సర్కిల్ కాలేజ్ సర్కిల్ మీదుగా సాగింది. మూడు కిలోమీటర్ల మేర ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు కర్షకులు పట్ల ఉదాసీన వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. 32 మండలాలు ఉండగా అందులో 21 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి మిగిలిన 11 మండలాలను చేర్చకపోవడం విచారకరమన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే జగన్ రైతులను నట్టేట ముంచారన్నారు. జగన్ ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే భవిష్యత్తులో తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణానికి చెందిన ఎద్దులబండ్ల యజమానులు పట్టణానికి సమీపంలో ఉన్న పోతుల నాగేపల్లి వద్ద గల చిత్రావతిలోకి వెళ్లి ఇసుకను బండ్ల ద్వారా తీసుకొచ్చి అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. గ్రామానికి చెందిన అగ్రవర్ణాలకు చెందిన కొందరు ఎద్దుల బండ్ల యజమానులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎద్దుల బండి యజమానులపై దాడులు చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొత్తపేట మారుతి, సిపిఎం నాయకులు ఎస్‌హెచ్. బాషా, పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, సిఐటియు మండల అధ్యక్షులు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, నాయకులు వెంకటస్వామి, రైతులు శ్రీనివాస్ రెడ్డి, అంజి, రవి, వెంకటేష్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : గాండ్లపెంట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు గంగన్న, ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి పంట సాగు చేసిన ప్రతిరైతు నష్టపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి గాండ్లపెంటను కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మండల రైతులు ఇస్మాయిల్, ఫక్రుద్దీన్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఈ ఏడాది పంట సాగుచేసి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరానికి 45 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటను సాగు చేసేందుకు భూమిని దున్ని చదును చేసుకొని వర్షాభావం కారణంగా పంట సాగుచేయలేక పోయిన రైతులకి ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటనష్టపోయిన ఉద్యాన వన రైతులకు ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో మల్బరీ రైతులకు రావాల్సిన ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. మోటర్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ నాగరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు

గోరంట్ల రూరల్ : బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిలోని గోరంట్ల మండలంలోని రెడ్డి చెరువు పల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తచెరువు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు డి. మస్తానప్ప రామన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆయన రెడ్డి చెరువు పల్లి పాఠశాలకు మూడు రోజుల క్రితం డిప్యూటేషన్ పై బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం ఉదయం పాఠశాలకు వెళు తుండగా రెడ్డి చెరువు పల్లి క్రాస్ వద్ద గల జాతీయ రహదారిపై పెనుగొండ వైపు నుండి బెంగళూరు వైపు వెళ్తున్న కారు మస్తానప్ప ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మస్తానప్పను 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డయల్ 100తో బాధితుడికి న్యాయం

బంగారం ఉన్న బ్యాగు అప్పగింత

ప్రజాశక్తి ముదిగుబ్బ

బాధితుడు 100కి ఫోన్ చేసి పోలీసుల సాయంతో తాను పోగొట్టుకున్న బంగారం ఉన్న బ్యాగును పొందాడు. అందుకు సంబంధించిన వివరాలు... నరేష్‌కుమార్ అనే వ్యక్తి కదిరి నుంచి అనంతపురానికి బస్సులో వస్తున్నాడు. ఆసమయంలో అతని సీటు పక్కన ముస్లిం వ్యక్తి కూర్చొన్నాడు. ముదిగుబ్బ సమీపంలో ఉన్న మసీదు వద్ద ముస్లిం వ్యక్తి దిగిపోయాడు. ఆసమయంలో తమదే అని భావించి పొరపాటున సరేష్‌కుమార్‌కు చెందిన బ్యాగును తీసుకుని బస్సు దిగి వెళ్లిపోయారు. కొద్దిదూరం పోయిన తరువాత నరేష్‌కుమార్ బ్యాగును చూసుకోగా కన్పించలేదు. దీంతో ఆతనకు వెంటనే 100కు ఫోన్‌చేసి విషయం తెలిపాడు. వారి నుంచి సమాచారం అందుకున్న ముదిగుబ్బ పోలీసులు రంగంలోకి దిగారు. నరేష్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు మసీదువద్ద ప్రార్థనకు వెళ్లిన ముస్లిములకు వారి మతపెద్దల సహకారంతో విషయం తెలిపారు. అప్పుడు బస్సులో నుంచి పొరపాటున బ్యాగు తీసుకున్న ముస్లిం వ్యక్తి తన పొరపాటును గ్రహించి బ్యాగు తిరిగి ఇచ్చాడు. దీంతో ఎస్‌ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బాధితుడు నరేష్‌కుమార్‌కు బ్యాగును అప్పగించారు. బ్యాగులో రూ. 50 వేల విలువ జేసే బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని అన్నీ సక్రమంగానే ఉన్నాయని బాధితుడు తెలిపాడు. తాను పోగొట్టుకున్న బ్యాగును తిరిగి అప్పజెప్పిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఘనంగా ప్రపంచ నేలదినోత్సవం

తనకల్లు తనకల్లు 1 రైతు భరోసా కేంద్రం నందు మంగళవారం ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఒ శ్రీహరి నాయక్ మాట్లాడుతూ మానవాళికి ప్రకృతి ప్రసాదించిన సహజ వనరుల్లో నేల ఒకటి అని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న జనాభాకు తరుగుతున్న సహజ వనరులతో సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేసే క్రమంలో విచక్షణ రహితంగా చేపడుతున్న రసాయనిక యాజమాన్య పద్ధతుల వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రైతు నేల సంరక్షణకు సంబంధించిన విషయాలపై అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పట్టు పరిశ్రమ శాఖ సహాయకులు మహేష్, రైతు సంఘం నాయకులు శివన్న, రమణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ ఎంపీపీ

ధర్మవరం టౌన్ : ఈనెల 7వతేదీనధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరనున్నట్టు మాజీ ఎంపీపీ సాకే మద్దిలేటి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైన నాయకుడిగా పనిచేశానన్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల 2019లో వైసీపీలోకి చేరానన్నారు. ప్రస్తుతం తిరిగి తాను టీడీపీలోకి ఈనెల 7న ధర్మవరం పార్టీ కార్యాలయంలో పరిటాలశ్రీరామ్ సమక్షంలో చేరనున్నట్టు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం టౌన్ : ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ఆయుధం లాంటిదని, 18 సంవత్సరాలు వయసు గల వారందరూ కూడా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ యుగేశ్వరి దేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే బీఎల్‌వోల ద్వారా అర్హత గల వారందరికీ కూడా ఓటు హక్కును కల్పించడం జరిగిందని న్నారు. ఈనెల 2,3వ తేదీలలో కూడా స్పెషల్ డ్రైవ్ ను కూడా నిర్వహించడం జరిగిందన్నారు.

అంతర్జాతీయ గ్రాఫిక్స్ పోటీల్లో తలుపుల విద్యార్థిని ప్రతిభ

తలుపుల : అంతర్జాతీయ గ్రాఫిక్స్ పోటీలలో తలుపుల మండలానికి చెందిన క్రీడాకారిణి ప్రతిభ కనపర్చి కాంస్య పతకం సాధించింది. మండలంలోని గరికపల్లికి చెందిన సూర్యనారాయణ రెడ్డి, శివలక్ష్మిదేవి దంపతుల కుమార్తె స్నేహలత అంతర్జాతీయ గ్రాఫిక్స్ పోటీల్లో ప్రతిభ కనపర్చింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనపర్చిన స్నేహలతను వైసిపి సిఇసి సభ్యులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎంపీపీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అని అన్నారు. మండల పరిధిలోని క్రీడాకారులు ఐదు విభాగాల నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ కరుణాకర్, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే బీసీలకు న్యాయం

మడకశిర : తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు న్యాయం జరిగిందని జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికారిక కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మడకశిరలో బీసీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాధికార సమితి నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రామాంజనేయులు శివప్రసాద్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బీసీలకు ఆదరణ పనిముట్లు మంజూరు చేసి ఆదుకున్నారన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు, స్థానికులు



పార్టీలోకి చేరిన వారికి టిడిపి కండువాలు వేస్తున్న నాయకులు

ప్రజాసంక్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి - మడకశిర

రాష్ట్ర ప్రజల సంక్షేమమే టిడిపి అధినేత చంద్రబాబు ప్రధాన ధ్యేయమని ఆపార్టీ పట్టణ అధ్యక్షులు మనోహర్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని 11, 6, 19, 20 వార్డుల్లో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆపార్టీ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి టిడిపి రూపొందించిన మినీ మేనిఫెస్టో అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్ సాబ్, మాజీ కౌన్సిలర్లు ఫయాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు రహంతుల్లా, నాగరాజు, తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు, బూత్ కన్వీనర్లు ఈరప్ప, రాజు, అసిదుల్లా, పట్టణ మహిళా అధ్యక్షురాలు అంజమ్మ, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక : పట్టణంలో చేపట్టిన బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరినట్లు పట్టణ కన్వీనర్ మనోహర్ తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో పట్టణానికి చెందిన వైసిపి నాయకుడు అశోక్ తెలుగుదేశం పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్ సాబ్, మాజీ కౌన్సిలర్ ఫయాజ్ , మాజీ కోఆప్షన్ సభ్యులు రహంతుల్లా, నాగరాజు, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అప్‌గ్రేడ్ అయినఉన్నతపాఠశాలల్లో హెచ్‌ఎంలతో సహా అవసరమైన ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ రాజేశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ధర్మవరం పట్టణ అధ్యక్షులు హరికృష్ణ, ప్రధానకార్యదర్శి పోసా సాయిగణేశ్, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, బిల్లే రామాంజినేయులు, బాలగొండ్ల ఆంజనేయులు, రామాంజినేయులు, మేరీ వరకుమారి, లతాదేవి, ఆదిశేషు, నాగేంద్రమ్మ, హనుమంతు, జనార్ధన్, గోపాల్‌రెడ్డి, కృష్ణతేజ, కృష్ణకిశోర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఫోటో 15-ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తూతూమంత్రంగా కులగణన అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నంబుల పూల కుంట

స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కులగణనపై అవగాహన సదస్సు తూతూమంత్రంగా జరిగింది. ఈ సమావేశానికి మండలం మొత్తానికి సచివాలయాల పరిధిలో ఒకే ఒక్క పంచాయతీ సెక్రెటరీ హాజరు అయ్యారు. మండలంలోని కొన్ని శాఖల అధికారుల మాత్రమే నామమాత్రంగా హాజరయ్యారు. రెవిన్యూ అధికారులు, వివిధ శాఖ మండల స్థాయి అధికారులు, రాజకీయ పార్టీ నాయకులైన ప్రతిపక్ష, అధికార పక్ష నాయకులు ఎవరు హాజరు కాలేదు. ఎవరూ లేకపోయినా ఏదో జరిపామన్నట్లు కుల గణన అవగాహన సదస్సును అధికారులు నిర్వహించారన్న విమర్శలు వెల్లువెత్తాయి.



సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు


ప్రజాశక్తి - మడకశిర

సర్వ శిక్ష అభియాన్ పథకంలో పనిచేస్తున్న ఎమ్మార్సీల, పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాధికారులు శ్రీనివాస భాస్కర్, నరసింహమూర్తికి సమ్మె నోటీసు అందజేశారు. వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను పట్టించుకోవడంలేదని కుటుంబ పోషణ భారంగా ఉందని వాపోయారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు అందజేయడం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



సమ్మెనోటీసు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలు వివరించే బోర్డును ఆవిష్కరిస్తున్న ఛైర్‌పర్సన్, తదితరులు

ధర్మవరం టౌన్

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాన ధ్యేయమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ తెలిపారు. పట్టణంలోని 12వ వార్డులో ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ ఛైర్మన్ జయరాం రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మాసపల్లి సాయికుమార్, 12వ వార్డు కౌన్సిలర్ తొండమాల ఉమాదేవి, వార్డు ఇన్‌ఛార్జులు చాంద్‌బాషా, ఎస్పీ బాషా, తొండమాల రవి, తీర్థాల వెంకటరమణ, తోపుదుర్తి వెంకటరాముడు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : జగనన్న ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందనిఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నారనాగేపల్లి సచివాలయ పరిధిలో వై నీడ్స్ జగన్ ఎపి అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైసిపి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.నారాయణరెడ్డి, జెట్టి మారుతిరెడ్డి, ఆర్ఎ. రవిశేఖర్ రెడ్డి, స్థానిక సర్పంచి నాగార్జున, ఎంపిటిసి నాగేంద్రప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, డీలర్ మహేష్ రెడ్డి, లక్ష్మి నారాయణప్ప, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్: మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, కడప రాజా తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలం మైదుగోళంలో వైసిపి నాయకులు వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణాల శ్రీనివాస్ రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా : పల్లె

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాల్లో బాధితులను పరామర్శించారు. బత్తలపల్లి గ్రామంలో తెలుగుదేశం నాయకులు కిష్టప్ప కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల క్రిష్టప్ప కుమారుడు పవన్ అనారోగ్యంతో మృతిచెందడంతో అతని భార్యకు ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో విత్తన రాగులు పంపిణీ

గుడిబండ : మండల వ్యాప్తంగా బోర్లు బావులు కలిగిన రైతులకు ఆయా గ్రామాల రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో విత్తన రాగులు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి వీర నరేష్ తెలిపారు. నాలుగు కిలోల బ్యాగు ధర 139 రూపాయలు ఉంటుందని ఒక్కొక్క రైతుకు 6 బ్యాగులు గరిష్టంగా పంపిణీ చేస్తామని వివరించారు. విత్తన రాగుల కావలసిన రైతులు తమ తమ పేర్లను స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకొని విత్తనాలను తీసుకెళ్లాలని ఆయన రైతులకు సూచించారు.